క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన లయన్స్ క్లబ్ సభ్యులు



కలెక్టర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను తన కార్యాలయంలో హర్ష వల్లి లయన్స్‌క్లబ్ సభ్యులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా క్లబ్ చేపట్టిన, చేపట్టబోయే సేవా కార్యక్రమాలను క్లబ్ ప్రతినిధి వావిలపల్లి జగన్నాథ నాయుడు వివరించారు. కలెక్టర్‌ను క్లబ్ సభ్యులు దుశ్శాలువతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. క్లబ్ ద్వారా చేపట్టబోయే కార్యక్రమాలకు తన సంపూర్ణ సహకారం ఉంటుందని కలెక్టర్ అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలలో స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములు కావాలని కోరారు. లయన్ హారికా ప్రసాద్, డాక్టర్ చింతాడ కృష్ణ మోహన్, తర్లాడ అప్పలనాయుడు, మణిశర్మ తదితరులు పాల్గొన్నారు.

నీట్ రివైజ్డ్ ఫలితాల్లో సుభాష్య ప్రతిభ



సుభాష్యకు మిఠాయి తినిపిస్తున్న తల్లిదండ్రులు

శ్రీకాకుళం న్యూకాలనీ: నీట్–2024 రివైజ్డ్ ఫలితాల్లో జిల్లాకు చెందిన తండ్రాపు సుభాష్య ప్రతిభ కనబర్చింది. తాజాగా వెలువడిన ఫలితాల్లో సుభాష్య (హెచ్‌టీ నంబర్:1206120206) 720 మార్కులకు 690 సాధించి శభాష్ అనిపించింది. దీంతో ఆలిండియా స్థాయిలో 3198వ ర్యాంకు, ఓబీసీ కేటగిరీలో 1158వ ర్యాంకు సాధించింది. అంతకు ముందు జూన్‌లో వెలువడిన ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో 4265 ర్యాంకు, ఓబీసీ కేటగిరీలో 1624 ర్యాంకు సాధించింది. పదో తరగతిలో 590 మార్కులు, ఇంటర్మీడియెట్‌లో 980 మార్కులు సాధించి సత్తాచాటింది. తండ్రి శ్రీనివాసరావు అంపోలు జెడ్పీహెచ్‌స్కూల్‌లో ఫిజికల్ డైరెక్టర్ (ఎస్‌ఏ పీఈ)గా పనిచేస్తుండగా, తల్లి పద్మావతి గృహిణి. ప్రస్తుతం శ్రీకాకుళం సమీపంలోని నవభారత్‌నగర్ వద్ద నివాసం ఉంటుండగా.. వీరిస్వస్థలం జిల్లాలోని నరసన్నపేట మండలం సత్యవరం.

ముద్ద చర్మవ్యాధి నివారణకు టీకాలు

శ్రీకాకుళం రూరల్: మండలంలోని నైరా పంచాయతీ పరిధి వెంకటాపురంలో పశువులకు వ్యాక్సినేషన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ముద్ద చర్మవ్యాధి సోకకుండా నివారణ టీకాలు వేస్తున్నట్టు సిబ్బంది తెలిపారు. స్థానిక ఎంపీటీసీ సభ్యుడు బొబ్బాది చంద్రమౌళి, పశువైద్యులు స్వాతి, అర్జున్ ఉన్నారు.

కారుదొంగ అరెస్టు

శ్రీకాకుళం రూరల్: కారు దొంగను అరెస్టు చేసినట్టు శ్రీకాకుళం రూరల్ పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. కొత్తరోడ్డు సమీపంలోని చక్రధర్ ఐటీ సెంటర్‌కు చెందిన యాళ్ల చక్రధర్ ఈనెల 20వ తేదీన తన కారును కళాశాల సెంటర్ వద్ద పార్క్‌చేసి ఇంటికి వెళ్లిపోయారు. మరుసటి రోజున వచ్చి చూసేసరికి కారు కనిపించకపోవడంతో రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం పోలీసులు వాహనాలను తనిఖీలు చేస్తుండగా చక్రధర్‌కు చెందిన కారు అటువైపు వెళ్తుండడాన్ని సిబ్బంది గమనించారు. పోలీసులు కారును వెంబడించి సింగుపురం జంక్షన్ పట్టుకున్నారు. కారుకు సంబంధించి పత్రాలను అడగ్గా డ్రైవర్ లేవని చెప్పడం, అతని మాటలు పొంతన లేకపోవడంతో కారు దొంగిలించినట్లుగా పోలీసులు గుర్తించారు. కారును దొంగిలించిన వ్యక్తి సీతంపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కాట్రగడ్డ సంతోష్‌గా గుర్తించారు. రూరల్ ఎస్‌ఐ వాసుదేవరావు కారును దొంగిలించిన సంతోష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నైపుణ్యాలు తప్పనిసరి



మాట్లాడుతున్న హెచ్‌ఎం నారాయణరావు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని ముద్దాడ బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ప్రాథమిక విద్య నుంచి విద్యార్థుల్లో నైపుణ్యాలు తప్పనిసరిగా ఉండాలని హెచ్‌ఎం తమ్మినేని నారాయణరావు అన్నారు. ప్రస్తుత విద్యా విధానంలో అనేక మార్పులు వస్తున్నాయన్నారు. సత్ఫలితాలు సాధించాలంటే తల్లిదండ్రుల మద్దతు కూడా అవసమన్నారు. విద్యార్థి కేంద్ర బింధువుగా విద్య కొనసాగుతుందన్నారు. ఉపాధ్యాయులు కె.కొండయ్య, బి.భవాని పాల్గొన్నారు.

అరకొర సౌకర్యాలతో అవస్థలు!



పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులు

- జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వసతుల లేమి
- వెంటాడుతున్న సిబ్బంది కొరత
- ఇబ్బందుల్లో పాఠకులు, నిరుద్యోగ అభ్యర్థులు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సమస్యలు తిష్ట వేశాయి. అరకొర సౌకర్యాలు, సిబ్బంది కొరత, పూర్తిస్థాయిలతో లేని పుస్తకాలతో గ్రంథాలయాన్ని నెట్టుకొస్తున్నారు. దీంతో పాఠకులు, నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ మొత్తం ఐదు హాల్‌లు ఉన్నాయి. ఒక భవనంలో పాతపత్రికలు భద్రపరుస్తున్నారు. మరో భవనంలో గ్రంథాలయ వారోత్సవాలు, ఇతర వేడుకలు నిర్వహిస్తుంటారు. మిగిలిన మూడు భవనాలు పాఠకులు చదివేందుకు అనువుగా ఉంటాయి. ఇక్కడికి నిత్యం 300 మందికి పైగా పాఠకులు వస్తుంటారు. వీరిలో సుమారు 200 మంది పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. మిగిలిన వారు వార్తా పత్రికలు, ఇతర పుస్తకాలు చదివేందుకు వస్తుంటారు. ప్రభుత్వ సెలవు దినాలలో మినహా గ్రంథాలయం ఉదయం 8 నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకూ పని చేస్తుంటుంది. స్థానికులతో పాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన పాఠకులు అరకొర సౌకర్యాలతోనే సరిపెట్టుకుంటున్నారు. ప్యూరిఫైయర్ వాటర్‌మెషీన్ ఉన్నా పాడైపోయి ఆరు నెలలైంది. ప్రస్తుతం చిన్న బెంచీపై ఏర్పాటు చేసిన బాటిల్ వాటరే దిక్కు. మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానంగా మారింది. క్యారియర్ భోజనం తినేందుకు కూడా సరైన వసతి సౌకర్యం లేదు. కొందరు చెట్ల కింద, మరికొందరు పక్కనే ఉన్న టీటీడీ కార్యాలయ ఆవరణలో భోజనం చేస్తుంటారు. క్యారియర్లు శుభ్రం చేసుకునేందుకు కూడా సరైన వసతి సదుపాయాలు లేవు. గ్రంథాలయం వెనుకభాగంలో పెద్ద ఎత్తున మొక్కలు, వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో పాముల సంచారం పెరిగిందని పాఠకులు ఆందోళన చెందుతున్నారు. గ్రంథాలయంలో 11 మంది రెగ్యులర్ సిబ్బంది అందుబాటులో ఉండాలి. ప్రస్తుతం జిల్లా కార్యదర్శి, గ్రేడ్–1 , గ్రేడ్–3, రికార్డు అసిస్టెంట్, పార్ట్ టైం ఉద్యోగి కలిపి మొత్తంగా ఐదుగురు మాత్రమే ఉన్నారు. ఇంకా ఆరు పోస్టులు భర్తీ కావాల్సి ఉంది.

సెలవు రోజుల్లో తెరిచేనా?

ప్రభుత్వ సెలవు రోజుల్లోనూ గ్రంథాలయం తెరిచి ఉంచాలని చాలా మంది పాఠకులు కోరుతున్నారు. అయితే సిబ్బంది కొరత వల్ల ఇది సాధ్యం కాదని అధికారులు చెబుతున్నారు. ఈ విషయమై ఇటీవల పలువురు పాఠకులు నిరసన వ్యక్తం చేసి స్థానిక ఎమ్మెల్యే దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. వారి విజ్ఞప్తి మేరకు చదువుకునేందుకు ఫంక్షన్‌హాల్ కేటాయించాలని సూచించగా గ్రంథాలయ అధికారులు అంగీకరించారు. అయితే సెలవు రోజుల్లో మినహా మిగతా రోజుల్లో ఫంక్షన్ హాల్ తాళం పాఠకుల వద్ద ఉండకూడదని చెప్పినా వారు వినడం లేదని, ఏదైనా జరగరానిది జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని గ్రంథాలయ అధికారులు, సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



అధ్వానంగా ఉన్న మరుగుదొడ్డి



గ్రంథాలయం వెనుకభాగంలో పేరుకుపోయిన మొక్కలు, వ్యర్థాలు

పాతపుస్తకాలే దిక్కు



మాది సంతకవిటి మండలం. డిగ్రీ వరకూ చదువుకున్నాను. వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు గత రెండేళ్లుగా శ్రీకాకుళం నగరంలో ఓ రూం తీసుకుని ఉంటున్నాను. రోజూ జిల్లా కేంద్ర గ్రంథాలయానికి వస్తుంటాను. ఇక్కడ అరకొర సౌకర్యాలే. పోటీ పరీక్షల నిమిత్తం చదువుదామంటే పాతపుస్తకాలే ఉంటాయి తప్ప కొత్తగా వచ్చిన పుస్తకాలు అందుబాటులో ఉండవు. దీంతో ఇబ్బంది ఉంది.

–కె.రమేష్, పాఠకుడు

అధ్వానంగా మరుగుదొడ్లు



మాది శ్రీకాకుళం నగరంలోని పి.ఎస్.కాలనీ. డిగ్రీ పూర్తి చేశాను. ఏడాదిగా రోజూ జిల్లా కేంద్ర గ్రంథాలయానికి వచ్చి వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాను. ఇక్కడ మధ్యాహ్న సమయంలో భోజనం చేసేందుకు అనువుగా ఉండదు. భోజనం చేసిన తర్వాత క్యారియర్ కడుగుదామంటే ఇబ్బందులు పడాల్సిన దుస్థితి.కరెంటు సమస్య కూడా వేధిస్తుంది. ఇక్కడ ఒక్క రూంకే ఇన్వర్టర్ ఉంది. సరైన మరుగుదొడ్లు లేవు.

–బి.భవానీ, పాఠకుడు

సిబ్బంది కొరత



మాది వంగర మండలం శవ్వాం గ్రామం. డీఎస్సీకి సిద్ధమవుతున్నాను. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సిబ్బంది కొరత ఉంది. ఇక్కడ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి అందుబాటులో పుస్తకాలు లేవు. డీఎస్సీకి ప్రిపేరేషన్‌కు సరిపడా పుస్తకాలు లేవు. పాతపుస్తకాలతోనే సరిపెట్టుకుంటున్నాం. మరుగుదొడ్ల పరిస్థితి మరీ దారుణంగా ఉంది.

–బి.లక్ష్మణరావు, పాఠకుడు

సౌకర్యాల కల్పనకు కృషి



జిల్లా కేంద్ర గ్రంథాలయానికి వచ్చిన పాఠకులకు కావాల్సిన సౌకర్యాల కల్పనకు తమవంతుగా కృషి చేస్తున్నాం. గ్రంథాలయానికి రావాల్సిన సెస్ రాకపోవడంతో నిధుల కొరత ఉంది. పాఠకులకు కావాల్సిన పుస్తకాలను వారి కోరిక మేరకు తెప్పించి అందుబాటులో ఉంచుతున్నాం. సిబ్బంది కొరత ఉన్నప్పటికీ పాఠకులకు ఎటువంటి అంతరాయం లేకుండా చూస్తున్నాం.

–కుమార్‌రాజు, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి

చెడు వ్యసనాలతో భవిష్యత్ నాశనం



రణస్థలం: అవగాహన కల్పిస్తున్న సీఐ రామచంద్రరావు



ఎచ్చెర్ల క్యాంపస్: మాట్లాడుతున్న ఎస్‌ఐ చిరంజీవి

రణస్థలం: చెడు వ్యసనాలతో యువత భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని జే.ఆర్.పురం సీఐ జి.రామచంద్రరావు తెలిపారు. మండలంలోని కొండములగాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గంజాయి, డ్రగ్స్ వాడటం వల్లే కలిగే దుష్ఫలితాలపై అవగాహన కల్పించారు. జే.ఆర్.పురం ఎస్‌ఐ కె.గోవిందరావు, ఏఎస్‌ఐ విజయ, సిబ్బంది ఉన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎచ్చెర్ల ఎస్‌ఐ ఎస్.చిరంజీవి అన్నారు. ఎచ్చెర్లలోని శ్రీవెంకటేశ్వర పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం మాదక ద్రవ్యాల నియంత్రణ, మైనర్ డ్రైవింగ్ అంశాలపై అవగాహన కల్పించారు. కళాశాలల్లో డ్రగ్స్ నియంత్రణకు కమిటీలు వేయాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్ వంటివి కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ వినియోగించాలన్నారు. ప్రిన్సిపాల్ భూపాలరావు పాల్గొన్నారు.

మొక్కలు నాటేందుకు చర్యలు

ఎచ్చెర్ల క్యాంపస్: బొంతలకోడూరు పంచాయతీలోని మలిపెద్దివానిచెరువు గట్టుపై మొక్కలు నాటాలని జిల్లా కేంద్రంలోని జెడ్పీలో నిర్వహించిన మీ కోసం పబ్లిక్ గ్రీవెన్స్ సెల్‌లో సర్పంచ్ పంచిరెడ్డి రాంబాబు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఉపాధి హామీ పథకం ఏపీఓ శోభాదేవి, అధికారులు, సిబ్బంది చెరువును శుక్రవారం పరిశీలించారు. ఉపాధి హామీ పథకం కింద మొక్కలు నాటేందుకు అంచనాలు రూపొందిస్తామన్నారు. చెరువు బాగు కోసం గతంతో తొమ్మిది లక్షలు నిధులు మంజూరు కాగా.. రూ.4.50 లక్షలు పనులు పూర్తయ్యాయని, మిగతా పైనులు సైతం పూర్తిచేయాలని అధికారుల దృష్టికి సర్పంచ్, రైతులు తీసుకువచ్చారు. ఎంపీటీసీ మాడుగుల జగదీష్ పాల్గొన్నారు.



మలిపెద్దివాని చెరువును పరిశీలిస్తున్న అధికారులు

ఆస్పత్రులను అభివృద్ధి చేయాలి

రణస్థలం: ఎచ్చెర్ల నియోజకవర్గంలో ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధి చేయాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో శుక్రవారం ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో కొన్ని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలను పరిశీలించానన్నారు. అక్కడ సౌకర్యాలు అంతగా లేవన్నారు. వైద్య సిబ్బంది కొరత కూడా ఉందన్నారు. ఒక్కచోటే పదేళ్లుగా పని చేస్తున్న సిబ్బంది ఉన్నారన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ కలయిక




ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం ప్రభుత్వ కళాశాలలో 1969–72 విద్యా సంవతసరంలో బీఎస్‌సీ చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో జరిగింది. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. మృతి చెందిన తోటి మిత్రులకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పిండి నాగేశ్వరరావు, ఎం.ప్రభాకరరావు, డి.సన్యాసిరావు, బి.చిరంజీవి రావు, ఎం.రామచంద్రరావు, డి.తులసీరావు, ఏ.కాశిబాబు, ఎం.పాపారావు, బి.ధర్మారావు ఉన్నారు.

జిల్లా క్రీడాకారుల ప్రతిభ

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం జిల్లా క్రికెట్ క్రీడాకారులు సమిష్టిగా రాణించడంతో ఏసీఏ అంతర్‌జిల్లాల అండర్–19 త్రీడేస్ మ్యాచ్‌ల క్రికెట్ టోర్నీలో ఘన విజయం సాధించింది. ఓపెనర్ నంబళ్ల సుశాంత్, ఆల్‌రౌండర్ మొదలవలస పూర్ణచంద్ర, జున్నారావు, సిద్ధూ విఘ్నేష్ తదితరుల రాణింపుతో శ్రీకాకుళం జట్టు బోనస్ పాయింట్‌తో కలిపి మొత్తం ఏడు పాయింట్లతో టోర్నీలో టాప్‌ప్లేస్‌లో నిలిచింది. వైఎస్సార్ కడప జిల్లాలో కేఓఆర్‌ఎం కళాశాల క్రికెట్ మైదానం వేదికగా నెల్లూరు జిల్లాతో జరుగుతున్న ఏసీఏ అంతర్‌జిల్లాల అండర్–19 పురుషుల త్రీడేస్ మ్యాచ్‌లో శ్రీకాకుళం జిల్లా జట్టు ఇన్నింగ్స్ 19 పరుగుల తేడాతో జయభేరి మోగించింది. జిల్లాకు చెందిన మీడియం పేసర్ జున్నారావు ఐదు వికెట్లు పడగొట్టి విజృంభించగా, సిద్ధు విఘ్నేష్ రెండు, పూర్ణచంద్ర, సుశాంత్ తలో వికెట్ సాధించి జట్టు విజయంలో కీలకభూమిక వహించారు. జిల్లా జట్టు ఘన విజయం పట్ల జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు పీఎల్‌ఎన్ శాస్త్రి, కార్యదర్శి హసన్‌రాజా, మెంటార్ ఇలియాస్, కోశాధికారి మదీనా శైలానీ, రవికుమార్ హర్షం వ్యక్తం చేశారు.

పిల్లల కదలికలపై దృష్టిసారించాలి



కాకినాడ ఆదిత్య కాలేజీలో అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ అవతారం

శ్రీకాకుళం క్రైమ్: పిల్లల కదలికలపై తల్లిదండ్రులు దృష్టిసారించాలని పోలీసు అధికారులు అన్నారు. మైనర్ బాలురు డ్రైవింగ్ వలన జరిగే ప్రమాదాలు, మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలు, సైబర్ మోసాలపై ప్రజలకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాలతో రూరల్ సీఐ ఎల్.సన్యాసినాయుడు, ట్రాఫిక్ సీఐ ఎం.అవతారం, రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ హరికృష్ణలు పలు విద్యాసంస్థల్లో అవగాహన కల్పించారు. మైనర్లు ఎక్కువగా విద్యార్థులే కావడం, కుటుంబసభ్యులు అతి ప్రేమతో వారికి ద్విచక్ర వాహనాలు ఇవ్వడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. తల్లిదండ్రులతో పాటు కళాశాలల యాజమాన్యాలు కూడా విద్యార్థులపై దృష్టిపెట్టాలని, లైసెన్సు లేకుండా రోడ్లపై తిరిగి ప్రమాదాలు చేస్తే చట్టపరమైన చర్యలుంటాయన్నారు. విచ్చలవిడిగా యువత మాదకద్రవ్యాలకు బానిసలవ్వడంతో వారి బంగారు భవిష్యత్తు నాశనమైపోతోందన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయా కళాశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.

జేసీని కలిసిన రెవెన్యూ సర్వీసుల సంఘం ప్రతినిధులు



జేసీ ఫర్మన్ అహ్మద్ ఖాన్‌తో సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా నూతన జాయింట్ కలెక్టర్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన ఫర్మన్ అహ్మద్ ఖాన్‌ను శ్రీకాకుళం జిల్లా రెవెన్యూ సర్వీసుల సంఘం ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. రెవెన్యూ ఉద్యోగులకు ఎటువంటి సమస్యల ఉన్నా తన దష్టికి తీసుకురావాలని జేసీ ఈ సందర్భంగా సూచించారు. జాయింట్ కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.వేణుగోపాలరావు, జిల్లా అధ్యక్షులు కె.శ్రీరాములు, సహాధ్యక్షులు పి. శ్రీనివాసరావు, కార్యదర్శి బి.వి.వి.ఎన్.రాజు, ఉపాధ్యక్షులు ఎస్.దిలీప్ చక్రవర్తి, మురళీధర్ నాయక్, డి.అమర్నాథ్, జాయింట్ సెక్రటరీలు కె. కష్ణకాంత్, బి.శ్రీనివాసరావు, కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షులు డి.సోని కిరణ్, కార్యదర్శి రాజారెడ్డి, శ్రీకాకుళం డివిజన్ అధ్యక్షులు ఎస్.కిరణ్ కుమార్, టెక్కలి డివిజన్ అధ్యక్షులు కె.ప్రవల్లిక ప్రియ, కార్యదర్శి పి.రవి, పలాస డివిజన్ అధ్యక్షులు రెయ్యి రామారావు, పి.శ్రీనివాస్ ఉన్నారు.

ఒలింపిక్స్‌లో పతకాల పంట పండించండి



అభినందన కార్యక్రమంలో బ్యాడ్మింటన్ ప్రతినిధులు, క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్యారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్ గేమ్స్‌లో భారతదేశ క్రీడాకారులు పతకాల పంట పండించాలని ఆకాంక్షిస్తు బ్యాడ్మింటన్ క్రీడాకారులు అభినందనలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం 312/2022 రిజిస్ట్రేషన్‌తో ఏర్పాటైన జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక శాంతినగర్ కాలనీలోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో 'ఆల్‌దిబెస్ట్ టీమిండియా' పేరిట బెస్ట్ విషెస్ తెలియజేశారు. క్రీడాకారులు పతకాల సునామీ సృష్టించాలని వక్తలు, సంఘ ప్రతినిధులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆ సంఘ జిల్లా చైర్మన్ నటుకుల మోహన్, మామిడి సాయిగణేష్, కోచైర్మన్ తర్లాడ అప్పలనాయుడు, అధ్యక్షుడు నక్క రామకృష్ణ, ఉపాధ్యాక్షులు నారా ఈశ్వరరావు, ఎన్.శ్రీనివాసరావు, బాడ్మింటన్ కోచ్ డిల్లేశ్వరరావు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



మొక్క నాటుతున్న సాయికుమార్

రణస్థలం: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ అన్నారు. మండల పరిషత్ ప్రాంగణంలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూతాపం బాగా పెరిగిపోయి, దేశంలోని పలు నగరాల్లో పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు అవుతున్నాయన్నారు. తమవంతుగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఎంపీడీఓ రమణమూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, రెడ్డి విశ్వేశ్వరరావు, చినరామినాయుడు, గొర్లె అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా సంతోషిమాత



శాకంబరిగా సంతోషిమాత

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలోని సంతోషి మాత అమ్మవారిని ఆషాఢ మాసం శుక్రవారం సందర్భంగా శాకంబరిదేవిగా అలంకరించారు. అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ నేతృత్వంలో అమ్మవారికి అష్టోత్తర శతనామాలతో శ్రీచక్ర పూజలు చేసి, ఉద్యాపనలు, మహానివేదన, మహా హారతి నిర్వహించి, తీర్థ ప్రసాదాలు అందించారు. పలు రకాల కూరగాయలు, ఆకుకూరలతో అమ్మవారిని అలంకరించారు. అమ్మవారిని అధికసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

గుజరాతీపేటలోని రాజరాజేశ్వరీ మహా త్రిపుర సుందరి పీఠంలో ఆషాఢమాసం సందర్భంగా రాజరాజేశ్వరీ మహా త్రిపుర సుందరి అమ్మవారిని శాకంబరిగా శుక్రవారం అలంకరించారు. పీఠం నిర్వాహకులు పెంట రామచంద్రశేఖరశర్మ, వాశిష్ట కార్తికేయశర్మలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు. అమ్మవారి సన్నిధిలో సౌందర్యలహరి, లలితా సహస్రనామ పారాయణలు జరిగాయి. జగద్గురు ఆది శంకరాచార్య సనాతన సాహిత్య సాధన మండలి సభ్యులు, పీఠం భక్తులు పాల్గొన్నారు.

అమరులను స్మరించుకోవాలి



ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం



శ్రీకాకుళం రూరల్: సైనికులు, అవార్డు గ్రహీతులను సత్కరిస్తున్న దృశ్యం



శ్రీకాకుళం అర్బర్: రక్తదానం చేసిన విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న మాజీ సైనికులు



శ్రీకాకుళం న్యూకాలనీ: కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న జీడీసీ మెన్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు

శ్రీకాకుళం రూరల్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా నిర్వహించిన కార్గిల్ విజయ్ దివాస్ సెమినార్‌లో భాగంగా మండల పరిధిలోని గురజాడ విద్యాసంస్థల్లో బీజేపీ యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు బూరె నరేంద్ర చక్రవర్తి ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివాస్ సెమినార్‌ను శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి యువత పోరాటం చేసి అమరులైన వీరులను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. దేశం కోసం ప్రాణాలర్పించిన సుభాస్ చంద్రబోస్, భగత్‌సింగ్, ఝాన్సీ లక్ష్మీబాయ్‌లను ఈతరం విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం కార్గిల్ యుద్ధంలో పోరాటం చేసిన వీరులకు అలాగే గ్యాలరీ అవార్డులు తీసుకున్న మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం నాయకులు పి.వి.రమణమూర్తి, వంగ మహేష్, ఉమా మహేశ్వరరావు, యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు వెంకట్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజకుమార్‌రెడ్డి, రాజేంద్రనాయుడు, పైడి వేణుగోపాలం, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

అల్లినగరంలో..

ఎచ్చెర్ల క్యాంపస్: అల్లినగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా కార్గిల్ విజయ దివాస్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేశారు విజేతలకు హెచ్‌ఎం కె.పార్థసారథి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

యువతకు ఆదర్శం కావాలి

శ్రీకాకుళం అర్బన్: భరతజాతి చరిత్రపుటల్లో సువర్ణాక్షరాలతో నిలిచిన కార్గిల్ యుద్ధ విజయాన్ని మువ్వన్నెల జెండా తరహాలో విజయగర్వంతో జరుపుకొనే పండుగ విజయ దివాస్ అని శ్రీకాకుళం జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి ఎం. శైలజ అన్నారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో మాజీ సైనికుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎందరో అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ నివాళులు అర్పించే పవిత్రమైన రోజు అని అన్నారు. కార్గిల్ విజయ్ దివాస్ సందర్భంగా మాజీ సైనికులు అంతా కలిసి కట్టుగా ముందుకు వచ్చి మెగా రక్తదానం చేయటం నిజమైన నివాళి అని కొనియాడారు. కార్గిల్ అమర వీరుల త్యాగాలు నేటి తరం యువతకు ఆదర్శం కావాలి అని అన్నారు. శ్రీకాకుళం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మాజీ చైర్మన్ డోల జగన్మోహనరావు మాట్లాడుతూ.. జై జవాన్ జై కిసాన్ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకువచ్చిన మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ లాల్ బహదూర్ శాస్త్రి ఆలోచన విధానం ఆయన సైనికులకు రైతులకు ఇచ్చిన ప్రాధాన్యత నేటి తరం యువతకు తెలియజేయవలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. కార్గిల్ యుద్ధంతో భారత్ శక్తి, యుక్తలను ఆనాడు ప్రపంచ దేశాలకు తెలియ జేసేలా చేసిన ప్రధానమంత్రి వాజ్‌పాయ్ నేటి తరం రాజకీయ నేతలకు ఆదర్శంగా నిలుస్తారని కితాబు ఇచ్చారు. అనంతరం విశాఖపట్నం జిల్లా నుంచివ చ్చిన. జేవై అకాడమీ విద్యార్థులు 45 మంది రక్తదానం చేశారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నుంచి వందలాది మంది మాజీ సైనికులు కూడా రక్తదానం చేసి వీర సైనికులకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆమదాలవలస, శ్రీకాకుళం ఎమ్మెల్యేలు కూన రవి, గొండు శంకర్ సతీమణులు ప్రమీల, స్వాతి, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు తనయుడు తేజబాబు, మాజీ సైనికుల జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు పైడి రామారావ పాల్గొన్నారు.

అమరవీరులకు ఘనంగా నివాళి

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళంలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో జరిగిన వేడుకల్లో కార్గిల్ యుద్ధంలో స్పెషల్ ఫోర్స్ కమాండర్‌గా స్వయంగా పాల్గొన్న బి.చిన్నారావు ప్రత్యేక అతిథిగా హాజరై నాటి యుద్ధంలో పాల్గొన్న అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ బి.కిరణ్ కుమార్, కార్యక్రమ ఇన్‌ఛార్జి సౌజన్య, శ్రీకాంత్ పాల్గొన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్లతో కార్గిల్ యుద్ధంలో అమరులైన సైనికులకు కొవ్వొత్తులతో నివాళ్లర్పించారు. ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు, కళాశాల ఎన్‌సీసీ అధికారి డాక్టర్ వై.పోలినాయుడు, 14వ బెటాలియన్ ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.